# నందనవనం - 13

ఉదయమే లేచి తన పనులన్నీ ముగించుకుని రెడీ అయి బయలు దేరుతున్న కొడుకుని చూసి ‘‘ఎక్కడికి?’’ అని కళ్ళతోనే ప్రశ్నించింది శ్రీవల్లి.

‘‘నేను సాయంకాలానికే వస్తాను... మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రానమ్మా...!’’

‘‘అదేం.... మీ నాన్నతో కలిసి టిఫిను కూడా చేయవా....? సూర్యం కూడా వెళ్ళిపోయాడా.... ఒక్కరే తినడం మీ నాన్నకూ ఇష్టం ఉండదు..’’ అంటూ నిట్టూర్చింది.

‘‘నువ్వుంటావుగా అమ్మా... వడ్డనలాంటివన్నీ వదిలేసెయ్యి, ఇద్దరూ అన్నీ దగ్గిరే పెట్టుకుని చక్కగా కలిసి తింటే బావుంటుంది కదా! అది అలవాటు చేసుకోవాలి ముందు. ఏం...నేను చదువుకని వేరే వూళ్ళో ఉంటున్నపుడు.... అందరం కలిసి అన్నది కుదరలేదుగా!’’

‘‘అందుకని నువ్వున్నపుడూ.... వేరే చోట ఉన్నట్లుగా అనుకోవాలా..? ఈ కొన్ని రోజులూ అయినా.... వీలైనంత సమయం నీ మాటలు వింటూ ఉండాలనిపించదా? ఎదిగిన కొడుకుతో కలిసి పనిచేయటం .... ఆఖరుకు టిఫినూ, భోజనం చేయటం లాంటిపైనా కుదరటం లేదని మీ నాన్నకు... ఎంత ఇదిగా వుంటుందో తెలుసునా?”

రామం ఫక్కున నవ్వాడు.

‘‘అమ్మా... నీకు తెలిసినా తెలియనట్లు చెబుతున్నావుగానీ, నీ ముచ్చట్లు వింటూ తినటం నాన్నకి ఇంకా ఇదిగా ఉంటుందని తెలుసులే...!’’ అన్నాడు. ఆవిడ అదేమీ పట్టించుకోకుండా...‘‘అసలింతకీ ఎక్కడికీ...?’’ అని ఆరా తీసింది.

‘‘కొత్తగా అడుగుతున్నావేం... రోజూ గంటన్నర ప్రయాణం చేసి... ఆ టౌనులో బ్యాంకుల చుట్టూ తిరగడంతోనే సరిపోతోంది!’’.

‘‘ఈ పనుల్లోపడి మధ్యాన్నం భోజనమూ మానేస్తున్నావా..?’’ ఆవిడ ఆందోళన పడింది.

అపుడే అక్కడికి వచ్చిన ఆయన వారి మాటలన్నీ విన్నట్లుగా శ్రీవల్లితో అన్నాడు. ‘‘నీ చేతి వంట తినకపోతే, మానేసినట్లేనా.. ఆ ఊళ్ళో చాలా మంచి హోటల్స్ ఉన్నాయిలే’’ అని ‘‘అవునూ.... ఈ వేళ నీకు మౌనవ్రతం కదా, కొడుకుతో ఇలా కబుర్లేసుకున్నావేంటీ...?’’ అంటూ ప్రశ్నార్థకంగా చూశారు.

‘‘ఆ సంగతి మర్చేపోయాను చూశారా...’’ అంటూ ఆవిడ నుదురు చేత్తో కొట్టుకుని ‘‘ఏముందీ.. అన్నింటికీ మంచిదని వారానికోరోజని అనుకున్నా కదా, ఇంకోరోజు చేస్తే సరీ...!’’ అంది..

‘‘రామం చూశావా.... వారమంతా నాతో మాట్లాడటమేమిటని ఒకరోజు మౌన వ్రతం ప్రకటించింది ! ఇపుడు నీమీద మురిపెంతో ఆ మాటే మర్చిపోయింది ! పిల్లలు తల్లిని అంతలా మురిపిస్తారు... మైమరిపించగలరూ అన్నమాట..!’’ అంటూ ఆయన సరదాగా నవ్వాడు.

రామం బయలుదేరి వెళ్తుంటే కాసేపు చూస్తూ గుమ్మం దగ్గిరే నిలబడిన వాళ్ళిద్దరూ లోపలకు వెళ్ళిపోయారు.

ఆవిడవి అన్ని పనులూ పూర్తయి... ఖాళీగా ఉన్నప్పుడు కొడుకుకు ఫోను చేసింది.

''ఈ వేళ ఎండ బాగా ఎక్కువగా ఉంది... ఇంతటి ఎండలో నువ్వేం హైరానా పడుతున్నావోననిపించి... వాకబు చేద్దామనీ...!''

శ్రీవల్లి మాటలకు రామం ''అదేం లేదమ్మా... ఏ.సి. గదిలో చల్లగా హాయిగానే కూర్చున్నాలే...!'' అంటూ ఫోనులోనే బదులిచ్చాడు.

''అయితే ఫర్వాలేదులే.....'' అంటూ స్థిమితపడినట్లుగా నిట్టూర్చింది. ''ఏ విషయంలో నైనా అవసరమైనప్పుడు ఆ పరమేశ్వరంగారూ వాళ్ళ సాయం తీసుకుంటూండు. మీ నాన్నేమో పూర్తిగా ఈ వ్యవసాయం పనుల్లో పడిపోయారు..!''

''వాళ్ళ భాగస్వామ్యమే ఎక్కువగా ఉన్నపుడు.. నేనొక్కడినే ఎందుకు తంటాలూ పడతానూ... ఇదిగో... వాళ్ళమ్మాయి ఇక్కడే ఉంది.... మాట్లాడతావా...?'' ఫోను ఆ అమ్మాయి చేతికి ఇచ్చాడు.

ఆ అమ్మయి నవ్వు ఉట్టిపడే గొంతుతో గలగల మాట్లాడేసింది.

''ఏమిటండీ మీరు మా ఇంటికి ఓ సారి వస్తానన్నారు... రాలేదేం? మీ రొకసారి వచ్చి మాట్లాడాక, నేను పదే పదే వస్తానన్నా కదా, వచ్చి విసిగించేస్తానేమోనని రాకుండా అలా గీత గీశారా...?''

శ్రీవల్లీ నవ్వింది.

''వాన, వెన్నెల అంటే... ఎంత ఇష్టమో.. అలాగే నీరాక కూడాను! హాయిగా అనిపిస్తుంది గానీ... విసుగేస్తుందా? అపుడప్పుడు కాదు, ఎపుడూ మా ఇంట్లోనే ఉండేలా ఏర్పాటు కోసమే నేను ఎదురు చూస్తున్నానమ్మా...'' శ్రీవల్లి బదులు చెప్పింది.

''నిజమాండీ .. అయితే నా అంత అదృష్టవంతురాలు ఇంకెవరూ ఉండరనిపిస్తోంది!'' ఆ అమ్మాయి కంఠంలోని ఆనందాన్ని శ్రీవల్లీ గుర్తించింది.

''ఇప్పుడు... ఏం చేస్తున్నావమ్మా....? శ్రీవల్లి మాటలు పొడిగిస్తూ యథాలాపంగా అడిగింది.

''ఏముందీ... మీ రాక కోసం ఎదురు చూస్తూ ఇంటి గుమ్మం దగ్గరే ఎక్కువ సమయం గడిపేస్తున్నాననుకోండి... ఇపుడూ అంతే...!''

ఆ మాటకి శ్రీవల్లి ఫక్కుమనేసరికి ఆ అమ్మాయి కొంచెం తత్తరపాటుతో ''ఎందుకంతగా నవ్వుతున్నారూ..?'' అంది ఆరా తీస్తూ.

''నువ్వు.... మీ ఇంట్లో ఉన్నట్లుగా మాట్లాడితే నవ్వు రాదా మరీ... మావాడి ఫోనునుండే కదా మాట్లాడుతున్నావ్... అంటే... ఇద్దరూ ఒకచోటే ఉన్నారన్నమాటేగా.... ఏ.సి. గది అన్నాడు కాబట్టి ఏదో హోటల్‌కి వచ్చి ఉంటారని అర్థం చేసుకున్నాలే.....'' అని శ్రీవల్లే మళ్ళీ నవ్వింది.

''ఏమిటో... మీతో మాట్లాడుతోంటే.... మతి మరుపు వచ్చేసిందండీ....'' నవ్వుతూనే నందూ జవాబు చెప్పింది.

‘‘ఆ మతి మరుపు.... మాలాంటి వయసు మీరిన వాళ్ళకి వచ్చే జబ్బు! మీ వయసు వాళ్ళలా చేస్తే... మైమరపు అనవచ్చనుకుంటా... నచ్చిన వాళ్ళు పక్కన ఉంటే వచ్చే మతిమరపది!’’

నందూ పకపక నవ్వటం శ్రీవల్లికీ సరదాగా అనిపించింది.

‘‘మీరేం చెప్పినా వ్యతిరేకంచకుండా ఎవరైనా అవునసే అనాల్సిందేనని ఓసారి రామం అన్నాడు. అది నిజమేనని నాకిపుడు అర్థమైంది..! మరి... మీ రాక కోసం గుమ్మం దగ్గర వేచి ఉన్నాననటం ` నిజం కాదని పసిగట్టేసా నన్నారు! పోనీ మనసులోనే అలా ఎదురు చూస్తున్నానని చెబితే నమ్మి తీరాల్సిందేగా...?’’

నందూ ప్రశ్నకి నవ్వుతూ అంగీకరిస్తున్నట్లుగా శ్రీవల్లి జవాబు చెప్పింది. ‘‘ఇందాకనే చెప్పానుగా. అది ... వయసు ప్రభావం అని తప్పకుండా నమ్మతాను..! ఆ పైన ప్రేమ కూడా జత కలిస్తే... చెప్పేదేముందీ... ఆ తపనా, ఆరాటం... అన్నీ అర్థం చేసుకోగలను..!’’

‘‘అవునా.... నిజమాండీ..... మీ కంతగా అర్థం అవుతోందంటే... మీకూ అనుభవమేనని నాకు తెలిసింది..! మీ ప్రేమకథా వివరాలూ వినాలనిపిస్తోంది! మరి ఎప్పుడు వినిపిస్తారూ...?’’

ఆ ప్రశ్నకి శ్రీవల్లి నవ్వేసింది.

‘‘తప్పకుండా నందూ... ప్రేమనేది ప్రతి ఒక్కరినీ ఆవహిస్తుందనేది నిజం! అయితే ఒక్కో దశలో ఒక్కో విధంగా..! ఎప్పటివైనా ముచ్చట్లను ముచ్చటించుకోవటమనేది ఎవరికైనా సరే ముచ్చటైన అంశమే..! సరేమరి... ఇక ఈ

నాటికి ఈ ముచ్చట్లకి ముగింపు చెప్పేసి... మీవి కొనసాగించటానికి సమయం ఇస్తున్నాను...!'' అని నవ్వుతూ ఫోను పెట్టేసింది శ్రీవల్లి.

పక్కనే నిలబడి ఉన్న ఆయనని అపుడు గమనించిన శ్రీవల్లి నవ్వుతూ చూసింది.

''అర్థమైంది... ఈ రోజు ఎందుకు మౌన వ్రతానికి చుక్క పెట్టేసావో....! నందూతో కబుర్లు చెప్పుకోవాలనే కదూ....?''

ఆ ప్రశ్నకి శ్రీవల్లి ''అదేం కాదు.... అలా అవకాశం వచ్చిందంతే! నేను మనవాడేదో పాపం పనులంటూ ఒక్కడూ తిరుగుతూ సతమత మవుతున్నాడని బెంగపడుతున్నా. కానీ ఫరవాలేదు ... చక్కగా జంటగా హుషారుగా పనులు పూర్తి చేసుకోగలుగుతున్నాడని ఇప్పుడు అర్థమైంది..!'' అంటూ లేచి నిలబడిరది.

''రోజు... అని ఎందుకనుకుంటున్నావ్....? మధ్య మధ్య ఓ రోజు అంతేకదా..!''

ఆ మాటకి ఆయనవైపు శ్రీవల్లి చురుగ్గా చూసింది. ''అయితే ఎప్పుడెప్పుడు ఇద్దరూ కలిసి పనులకోసం వెళ్తున్నారో ... ఆ వివరాలన్నీ మీకూ ముందుగానే తెలుసన్నమాట!''

''ఇంటికి వచ్చాకనే కదా... పనుల గురించి మన ఇద్దరికీ ఒకేసారి వివరిస్తాడూ...? నాకు ప్రత్యేకంగా చెప్పేదేముంటుందీ.... ఏ రోజయినా చేసిన ప్రయత్నాలను విపులంగా చెప్పినప్పుడు.. ఆరోజు ఒక్కడే ఆ టౌనుకి వెళ్ళాడనీ, ఏదో క్లుప్తంగా ముగించేసినపుడు... ఆరోజు ఇద్దరూ కలిసి షికార్లలోనే ఎక్కువ సమయం గడిపారనీ నేను అర్థం చేసుకుంటున్నా నంతే...!''

''శ్రీవల్లి కళ్ళు పెద్దవి చేసి ఆయన వైపు విస్మయంగా చూసింది. ఆయన చిన్నగా నవ్వి ''నందూకి ... ఏదో నీ ప్రేమకథా చెబుతానన్నట్లున్నావ్.. ఏం చెప్పాలనుకుంటున్నావ్...?'' సరదాగా అడిగాడు.

శ్రీవల్లి చిరు కోపం నటిస్తూ ''మీ కెందుకూ చెప్పటం..?'' అంది.

''ఎవరికైనా... ముచ్చట్ల గురించి ముచ్చటగా ముచ్చటించుకోవటం ముచ్చటైన అంశమేకదాని!'' శ్రీవల్లి పెద్దగా నవ్వింది ''అన్నీ బాగానే విన్నారన్న మాట!'' అంది.

ఆయన పరిహాసంగా చూస్తూ ''అవును విన్నాను.. అందుకే నువ్వేం చెబుదామనుకున్నావో ముందుగా నేనూ ఓ మారు నీ నోటినుండి వినాలనీ..!''

''మీకు తెలియని కొత్త సంగతులు.. నేనేం చెప్పగలనూ..?..''

''తెలిసినవే అయినా మళ్ళీ ఓ మారు నెమరేసుకోవటం నాకూ బావుంటుంది..!''

ఆయన మాటలకు శ్రీవల్లి చిరునవ్వుతో చూసి ''అయితే... మీరే చెప్పొచ్చుగా.... నాకూ వినే సరదా ఉంటుందిగా...!'' అంది.

''ఇద్దరికీ ఉన్నప్పుడు... సరే, ఇద్దరూ కలిసి చెప్పుకుంటూ... ఆనాటి ఒకరి అనుభూతులను మరొకరుగా వింటుంటే... బావుంటుంది కదూ..?'' పక్కనే కూర్చుని వినటానికి సిద్ధపడుతున్నట్లు అన్నాడాయన.

''సరే... మొదలు పెట్టండి మీరే..!'' అంది శ్రీవల్లి కొంచెం హుషారు కలగలసిన కంఠంతో, ఆయన ఆవిడ అరచేతిని పట్టుకుని వ్రేళ్ళతో ఏదో రాసినట్లు చేస్తూ

మొదలుపెట్టబోతోంటే... తన చేతిని చురుగ్గా లాగేసుకుని ''ఇది అవసరమా...?'' అంది కొంచెం రుసరుసలతో.

''మాష్టారుకి పాఠం అప్పచెప్పినట్లు.... రెండు చేతులూ కట్టుకుని చెప్పాలంటావా...?''

ఆ మాటల్లోని విసురుకి శ్రీవల్లి తన అభ్యంతరాన్ని వెనిక్కి తీసేసుకున్నట్లు చిరునవ్వు చిందించింది!

ఆయన మొదలు పెట్టాడు.

''ఆరోజు.... సన్నగా ఒకటీ రెండుగా చినుకులు పడుతున్నాయి, ఆఫీసులోని వాళ్ళంతా ఇళ్ళకు వెళ్ళిపోయారన్న విషయాన్ని పనిలో మునిగి గుర్తించలేదు. అప్పుడు టైము చూసుకుంటే... చాలా రాత్రయిందని గుర్తించి... ఇక వెంటనే బయలుదేరాను, దారి మధ్యలో ...... ఆ రాత్రి వేళ ఒకమ్మాయి నిలబడి ఉండటం కనబడిరది. ఆ సమయంలో అలా ఒంటరిగా ఎందుకు నిలబడిరదా అని ఆశ్చర్యమేసింది.

''ఆరోజు నేనూ మీలాగే టైము గుర్తించకుండా... ఇంటర్వ్యూ కోసం ప్రిపేరవుతూ ఏవో పుస్తకాల్ని చూస్తూ మా ఫ్రెండ్స్ గదిలోనే ఉండిపోయాను. ఇక అపుడు బయలుదేరదామని కంగారుపడుతూంటే, వాళ్ళు ఆ రాత్రికి అక్కడే ఉండిపోమని సలహా ఇచ్చారు. కానీ నేనే వినిపించుకోలేదు. ఏ ఆటోనో దొరక్కుండా ఉండదనే ధీమాతో ఒక్కదాన్నీ వచ్చేసాను, కానీ ఏదీ కనుపించలేదు.

సన్నటి చినుకులు చెంపల్ని తాకుతోంటే.. ఇష్టంగా నిలబడి ఏదో ఆలోచనలో పడిపోయా.

‘‘అందుకేగా నేను నా కారు ఆపి.. చేతిలోని టార్చి లైటుతో దారి చూసుకుంటూ నీ దగ్గిరకు వచ్చి మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను. వస్తారా..?’ అని మెల్లగా మర్యాదగా అడిగితే.... ఉరుముతున్నట్లుగా చూసి ‘‘మీకు నేనెలా కనబడుతున్నానూ....?’’ అంటూ కస్సుమన్నావు...! తప్పేం మాట్లాడానూ అని కంగారొచ్చి ఓ క్షణం బెదిరిపోయాను. అదేమాట అడిగాను కూడా కదూ?’’

‘‘ఒంటరిగా నిలబడితే ... ‘వస్తారా’ అనడగటం మీకు తప్పుగా అనిపించటం లేదా అని కోపంగా రెట్టించాను కదూ? ఏమిటిలా చేశానూ... ఫ్రెండ్స్ రూములోనే ఉండిపోతే బావుండేది కదా, ఇంట్లోవాళ్ళు కంగారు పడతారేమోనని ఈ టైములో బయలుదేరి, ఇక్కడ నిలబడి ఇలాంటి పరిస్థితిని కొని తెచ్చుకున్నాను..’ అవి మనసులోనే అనుకుంటూ కొంచెం భయంగానే ఉన్నా. ఎలాంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోగలగాలని నాకు నేనే నచ్చచెప్పుకుని... అలా మాటల్లో బింకాన్ని చూపించానన్న మాట..!’’

‘‘నేనేమో.... నీ రంకెలకి ఠారెత్తి... ‘మీరు పూర్తిగా నా మాటల్ని వినకుండానే, చివరి మాటే విని అపార్థం చేసుకుంటున్నట్లున్నారు....’ అంటూ బెదిరిపోతూ సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది ...! తర్వాత లైటు నా మోహం మీదికి ఫోకస్ చేసుకొని సరిగా చూడండి... నేనయినా అలా అడిగే బాపతులా కనిపిస్తున్నానా - మంచి బాలుడు రాముడు అనే టైపులో లేనూ..?’ వీలైనంత అమాయకంగా అడిగేసరికి.. నన్ను తేరిపార చూస్తూ ఓ అంచనాకి రావటానికి ప్రయత్నిస్తున్నట్లున్నదానిలా చక్కగా నవ్వావు!’’

‘‘అవును... నమ్మదగ్గ మంచి వ్యక్తిలా అనిపించి ధైర్యం వచ్చేసింది మీ అభ్యర్థనని మన్నించి ‘సరే... పదండి....’ అంటూ మీ వెంట వచ్చి కారులో కూర్చున్నాను.’’

‘‘అప్పటికి నాలోనూ బెదురు తగ్గి కొంచెం హుషారు వచ్చింది. ‘ముందు పులిలా గాండ్రించి.. తర్వాత పిల్లిలా నా వెనుకే వచ్చేస్తున్నారూ.... మీకు నామీద నమ్మకం కలిగి ఉంటుందని అర్థమైందనుకోండి గానీ ... ఇపుడు ప్లేటు మార్చి ఎటో తీసుకెళ్ళిపోతేనో...?’ ఎలాగో అడగగలిగా...’’

‘‘మీ తీరు మారినా నాకేం భయంలేదు....! నా ప్రతాపం నేను చూపించగలను’ అంటూ గాంభీర్యం నటించా... కొంతమంది ఎంతగా అనుకున్నా మర్యాద మీరలేరని నేను తెలుసుకోగలను లెండి. అయినా మీరు... నాకు ధైర్యం కలిగించటంకోసం ‘నోట్‌చేసుకోండి.. ఎందుకైనా మంచిది భయం లేకుండా ఉంటుంది.’ అంటూ మీ కారు నెంబరున్నచోట టార్చి లైటు ఫోకస్ చేశారుకదా... దాంతో నమ్మకం, గౌరవం మరింత పెరిగాయి! అందుకే నిశ్చింతగా బయలుదేరాననుకుంటా!’’

‘‘తర్వాత.. మా ఆఫీసులోనే ఉద్యోగాలు ఉన్నాయంటూ చెప్పబోతే మళ్లీ కస్సుమన్నావు! ‘మీరేమీ సిఫారసు చేసి నాకు ఉద్యోగం ఇప్పించాలను కోకండి.. ఆ అవసరం నాకు లేదూ’ అని నిక్కచ్చిగా చెప్పి నా మాటల్ని కొట్టి పారేసావు....!’’

‘‘అవునుమరి... రాజ మార్గంలో... ఇంటర్వ్యూల్లో నా ప్రతిభ ద్వారానే ఉద్యోగం సంపాదించాలనేది నా కోరిక! అప్పటికింకా మా నాన్న ఉద్యోగం చేస్తున్నారు కాబట్టి నాకేమంత సంపాదించాల్సిన అవసరం వెంటనే లేకపోవటంతో అలాంటి ధీమా ఏర్పడిందనుకుంటా!’’

‘‘కడుపు నిండిన వ్యవహారం.... అని నాకూ అర్థమైంది! అందుకే ఇక మళ్ళీ అడగకుండా వూరుకున్నాను...!’’

‘‘అది ఊరుకోవటం అవుతుందా... మా ఇంటిదగ్గర కాకుండా ఆ సన్నని వీధిలోకి కారు వెళ్ళదని మొదట్లోనే ఆపమన్నాగా... ఆ తరువాత  ఒకసారి నేను ఇంటినుండి బయలుదేరి వస్తున్నపుడు వీధి మొదట్లో మీ కారును చూసి... నా కోసమే వచ్చారనుకున్నా. ‘ఎక్కడికి వెళ్తున్నారూ’ అని ఆరా తీసి... లిఫ్టు ఇస్తానంటే... తిరస్కరించి బెట్టు చేయాలనుకున్నా... కానీ నా అంచనా తారుమారైంది! నేను దగ్గరకు రాకమునుపే మీ కారు రివ్వున వెళ్ళిపోయింది నన్ను వెక్కిరించినట్లుగా. మొదట నాకు కొంచెం ఆశాభంగం అయినా, ఆ తర్వాత నా ఆలోచనకు నేనే నవ్వుకున్నా....!”

‘‘ఆ రోజు నేను మాత్రం.... నీ గురించి వివరం తెలుసుకోవాలనే వచ్చాను. ఆ వీధి మొదట్లో ఉన్న చిన్న బడ్డీ కొట్టు దగ్గర ఏవో కొంటూ నిలబడీ... అక్కడికి వచ్చిన ఓ అమ్మాయిని నీ గురించి కొంచెంగా వివరించి.... ‘తెలుసా’ అని అడిగా...’’

‘‘అవును... ఆ అమ్మాయి నాతో చెప్పింది. నా రూపురేఖలు వివరించి చివరగా ‘జాజి మొగ్గలా ఉంటుందని’ అన్నారటగా. దానికి అమ్మాయి పరిహాసంగా ‘జాజి మొగ్గలు కావాలంటే... పూల దుకాణానికి వెళ్ళాలికానీ, ఈ కొట్టుకు ఎందుకు వచ్చారూ’ అని నిలదీసానని చెప్పి ఎంత నవ్విందో...!’’ అంటూ ఆ జ్ఞాపకంతో కాబోలు శ్రీవల్లి మళ్ళీ పకపకమంది.

ఆయన చూపుల్లోకి రోషం వచ్చింది. ‘‘ఆ అమ్మాయిని నేనలా అడగనేలేదు. నిన్ను నవ్వించాలని చెప్పి వుంటుంది. తర్వాత ఆ మాటే నీకూ చెప్పాకదా... నేను మాత్రం ‘చూపుల్లో పొగరూ, మాటల్లో వగరూ ఉంటాయని’ హింట్ ఇచ్చాను అంతే...! నీ

వివరాలను సేకరించటానికి అలా తంటాలు పడాల్సి వచ్చింది...! అబ్బ....! అలా నీ ఫ్రెండ్స్ వివరాలు, వాళ్ళ రూము అన్నీ తెలుసుకుని... వాళ్ళ ద్వారా మా ఆఫీసులోని ఖాళీలకు నువ్వు అప్లై చేసేటట్లుగా చేసి... నీకు ఉద్యోగం ఇచ్చి... ఏదో సాధించిన సంతృప్తితో సంతోషించాను...!''

''ఇలా వాళ్ళ ద్వారా ఇంత తతంగం జరిగిందని తెలుసుకోలేక... నా తెలివి తేటల గుర్తింపు ద్వారానే వచ్చిందనుకుని మురిసిపోయా! మిమ్మల్నీ ఆ ఆఫీసులో చూశాక, మీ వివరాలన్నీ తెలిసాక... ఇలా ఎందుకు చేయడమని కోపంగా నిలదీసా కూడా కదా...!''

''అప్లై చేయించటం వరకే చేయాలనుకున్నా, అలాగే చేశాకూడా... మీ ప్రతిభద్వారా మాత్రమే సెలక్ట్ అయ్యారనే విషయాన్ని నీకు నచ్చచెప్పటానికి ఎంత కష్టపడాల్సి వచ్చిందో...!''

''ఒక వేళ నిజంగా అలా చేసి ఉన్నా.... అది నామీద ఉన్న ప్రేమతోనే కదా, అది సంతోషించాల్సిన సంగతే తప్ప కోపం ఎందుకని నాకు నేనే నచ్చచెప్పుకుని.... నాతో పరిచయం చేసుకోవాలనే మీ ఉత్సాహానికి పచ్చజెండా ఊపేశా...!''

''అందుకే ఒకసారి .... 'మీ ఇంటి దగ్గర డ్రాప్ చేయనా' అని యధాలాపంగా అడిగితే, నువ్వు ఆనందంగా తలవూపేసరికి... నాకు మతిపోయింది! 'ఏం వద్దు...' అని మామూలుగా చెప్పేసి 'ఏం... మీకేం పనిలేదా...?' అని ఎప్పటిలా ఎదురు ప్రశ్నా వేస్తావనుకుంటే... 'ఇదేమిటీ వింతగా ఉందే' అనుకుంటూ ఉత్సాహంగా కారు పోనిచ్చాను. వీధి మొదట్లో అప్పట్లోలాగే ఆపి 'మీ ఇల్లెక్కడా...?' అని అడిగితే, రెండు పెద్ద ఇళ్ళ మధ్య ఉన్న ఓ చిన్న ఇంటిని చూపించి... 'అదే' అన్నావు. నేను

అనుకోకుండానే 'అదా...?' అని ఆశ్చర్యంగా అడిగా. దానికే నీకు కోపం వచ్చేసి... 'ఏం చిన్న ఇంట్లో... ఉండేవాళ్ళు మనుష్యులు కాదన్నట్లు అంత ఆశ్చర్యం ఎందుకూ....?' అని రుసరుసలాడటమే కాదు 'అలాంటి ఇంట్లో... ఏదో ఎలుకల్లాంటి చిన్న జంతువులుంటాయనుకున్నారా?' అనీ దెప్పి పొడిచావు కదా...! ఏదో ఆశ్చర్యంలో అలా అనుకోకుండానే అడిగానే తప్ప... వేరే ఉద్దేశ్యం లేదంటూ 'మేం మునుపు అంతకంటే ఇంకా చిన్న ఇంట్లో ఉండేవాళ్ళమని, చిన్న ఇంట్లో ఉన్నంతమాత్రాన వాళ్ళ ప్రవర్తన చిన్నతనంగా ఉండాల్సిన అవసరం లేదనీ,' నీకు నచ్చచెప్పి, నమ్మించాల్సి వచ్చింది, నీ కోపం చల్లారి... నువ్వు చల్లగా నవ్వేవరకూ స్థిమితపడలేకపోయాను మరి!''